# త్రివర్ణస్వప్నం

**నేటి బాలలే రేపటి పౌరులు. స్వాతంత్ర్యం అంటే ఏమిటో అర్థం చేసుకొనే వయసు లేకపోయినా జాతిని గౌరవించాలన్న చైతన్యం వారిలో ఉంది**

సాయంత్రం.

గోలగోలగా ఉంది బడి. ఆ స్కూలులో ఇద్దరు పంతుళ్ళు.

పొరుగూరి నుంచి వచ్చే పడుచు మేష్టారు ఆపూట సెలవు పెట్టాడు. అంచేత ముసలి మేష్టారు గురుమూర్తికి గుక్క తిప్పుకోలేనంత పని. తన గదిలోంచి పక్క గదిలోకీ, పక్క గదిలోంచి తన గదిలోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. రేపు స్వాతంత్ర్య దినోత్సవమాయె! బడిలో జెండా ఎగరేయాలి. మీటింగు జరపాలి. పిల్లలచేత పాటలు పాడించాలి. వాళ్ళకు మిఠాయిలు పంచిపెట్టాలి. క్రమం తప్పకుండా ప్రతి ఏటా జరుగుతున్న తంతే ఇది. అయినా, ప్రతిసారీ అదో కొత్త అనుభూతి. ఒకటే హడావిడి పడిపోతున్నాడు గురుమూర్తి. ఆ రోజు చాలా పని జరిగింది బళ్ళో. బడి ఆవరణలో మొలిచిన పచ్చగడ్డి చెక్కి నేల చదును చేశారు పిల్లలు. బడిచుట్టూ ఉన్న కంచె బాగు చేశారు. రంగు కాగితాల తోరణాలు కట్టారు. జెండా ఎగరెయ్యడం కోసం దూలాల మీద దాచిన పొడుగాటి వెదురుకర్రను కిందికి దించి దుమ్ము తుడిచి అందంగా రంగు కాగితాలు చుట్టారు. పతాకావిష్కరణ తరువాత పాడవలసిన పాటలు ప్రాక్టీసు చేసుకుంటున్నారు.

గురుమూర్తి తన గదిలో ఉన్న పాత బీరువా తెరిచాడు. అడుగున భద్రంగా ఉంది- పాలిథిన్ కవర్లో మడిచిపెట్టిన జెండాగుడ్డ. దాన్ని బయటికి లాగాడు. మడత విప్పి తన మేజామీద పరిచాడు. నేత్రపర్వంగా విచ్చుకున్నాయి మూడు రంగులూ. సుదీర్ఘ జీవితానుభవంతో నిరాశానిస్పృహలు కమ్ముకున్న మనసులో, పురిటిపాపలా కాళ్ళూచేతులు కదలాడించింది ఆశావాదం. నగటు భారతీయుడి పాలిటి కల్పద్రుమం ఈ జెండా. వాడి సుఖశాంతులకు ప్రతీక ఈ జెండా.

ఎన్నేళ్ళు గడిచిపోయాయి. ఒకటా రెండా, యాభై ఏళ్ళు. మామూలుగా బడికొచ్చాడు తాను. ఊరూ వాడా వెల్లువెత్తినట్లు కనిపించింది. ఆవేళ ఆగస్టు పదిహేను. స్వతంత్రం వచ్చేసిందన్నారు పంతుళ్ళు. పిల్లలందరికీ చిన్నచిన్న కాగితపు జెండాలిచ్చారు. వరుసల్లో నిలబెట్టి, నినాదాలతో ఊరేగింపు జరిపించారు. పంతుళ్ళే స్వయంగా దేశభక్తి గీతాలు పాడారు. భారతమాతకు, గాంధీకి, నెహ్రూకు, బోసుకు, పటేలుకు, ఇంకా ఎందరెందరో మహానుభావులకు జేజేలు పలికించారు.

స్వతంత్రం అంటే ఏమిటో, స్వతంత్రం అనేది ఎందుకో తెలియని వయసది. 'ఇంగ్లీషువాళ్ళు వెళ్ళిపోయారు, ఇక మనం సుఖపడదాం.' పసిగుండెలు అర్థం చేసుకున్న సారాంశం ఇంతమాత్రమే.

ఆ తరువాత ఏటేటా క్రమం తప్పకుండా వచ్చే స్వాతంత్ర్య దినోత్సవాలన్నీ రివాజుగా తాయిలాలందించి వెళ్ళిపోతూనే ఉన్నాయి. చర్విత చర్వణం. రేపు మళ్ళీ ఆగస్టు పదిహేను. పిల్లలకు చెప్పాలి రేపు, స్వాతంత్ర్యం అంటే ఏమిటని! ఔను, ఏమిటి స్వాతంత్ర్యమంటే? జాతీయపతాకం విశిష్టత ఏమిటి? ఈతరం పిల్లలకు బోధపడేటట్లు చెప్పడం ఎలా?

ఒకటి, రెండు తరగతుల పిల్లలున్నారు ఆ గదిలో. వాళ్ళకు ఆ జెండాను చూపాడు గురుమూర్తి. "ఇదిగోరా పిల్లలూ, ఇదే మన మూడు రంగుల జెండా. దీన్నే రేపు మనం ఎగరేయబోతున్నాం." దాన్ని మళ్ళీ మడిచి మేజామీదే పెట్టాడు.

లేచి అవతలి గదిలోకి వెళ్ళాడు. అక్కడ మూడు, నాలుగు, అయిదు తరగతులున్నాయి. రేపు పాటలు పాడవలసిన పిల్లలంతా అక్కడే ఉన్నారు. వాళ్ళచేత ఒక్కోపాటే పాడించడం మొదలుపెట్టాడు గురుమూర్తి.

అప్పుడు గుమ్మం బయట నీడలా వచ్చి నిలబడ్డాడు ఓ పద్దెనిమిదేళ్ళ యువకుడు. తలెత్తి చూశాడు గురుమూర్తి. రాజా! వాణ్ణి అందరూ రాజా అనే అంటారు. రాజా అంటే ఎవరికి రాజా? ఈ వీధికా? ఈ ఊరికా? ఈ పరగణాకా? కావచ్చునేమో! కాదంటే మాత్రం చిక్కే.

"మా చంటీ కావాల సార్" అన్నాడు రాజా.

"క్రాపు చేయించాలి" అన్నాడు మళ్ళీ వాడే.

"ఊఁ... తీసుకుపో" అన్నాడు గురుమూర్తి గంభీరంగా.

చంటి అయిదేళ్ళ కుర్రాడు. నెల రోజుల కిందటే కొత్తగా ఒకటో తరగతిలో చేరాడు. రాజాకు ఏమవుతాడో తెలియదు. తిమ్మప్పగారిల్లు పెద్ద ఉమ్మడి కుటుంబం. ఎవరికి ఎవరు ఏమవుతారో బయటివాళ్ళకు తికమకగా ఉంటుంది.

రాజా చంటిని తీసుకుని వెళ్ళిపోయాడు.

గురుమూర్తికి చంటిమీద సదభిప్రాయం ఉంది. వాడు మంచి కుర్రాడు. చెప్పినమాట వింటాడు. చెప్పినట్లు నడుచుకుంటాడు.

రాజాపట్ల మాత్రం అంత మంచి అభిప్రాయం లేదు గురుమూర్తికి. తనకేగాదు, వాడంటే ఊళ్ళో ఎవరికీ కిట్టదు. చదువుకు నాగా పెట్టాడు వాడు. పరీక్షలో కాపీ కొడుతూ పట్టుబడింది చాలక, ఇన్విజిలేటర్ని కొట్టాడు. చిల్లర మల్లర దొంగతనాలు చేస్తుంటాడు. వీధుల్లో దుర్భాషలాడుతూ పోట్లాడుతుంటాడు. ఊళ్ళమీద బలాదూరుగా తిరుగుతుంటాడు. ఇళ్ళ పెరళ్ళవైపు గోడలమీద తుంటరిగా తిరుగాడుతూ, చెట్ల కొమ్మలు విరిచేస్తుంటాడు. వాడి అల్లరికీ, ఆకతాయితనానికీ అంతేలేదు. వాడికీ, వాడి ముఠాకీ అదుపే లేదు. అదొక విచిత్ర మనస్తత్వం వాడిది. తనకు లాభం ఉన్నా లేకపోయినా ఇతరులకు కష్టం, నష్టం కలిగించి ఆనందిస్తుంటాడు. జీవితంలో ఒక లక్ష్యం అంటూ లేదు వాడికి. సమాజానికీ, దేశానికీ నష్టం జరిగేది అలాంటివాళ్ళవల్లే.

వాచీలోకి చూసుకున్నాడు గురుమూర్తి. లేచివెళ్ళి ఇంటికి గంట కొట్టాడు. పిల్లలంతా హోలో మంటూ పరుగులు తీశారు. బడి తలుపులు తాళం వేయడానికి ముందు జెండా గుడ్డకోసం చూశాడు గురుమూర్తి. మేజామీద అది కనిపించలేదు. 'ఏమైంది చెప్మా' అనుకుంటూ మేజా కిందికి వంగి చూశాడు. గదంతా గాలించాడు. ఎక్కడా లేదు. మళ్ళీ బీరువాలోనే పెట్టి ఉంటానేమోనని బీరువా తెరచి చూశాడు. లేదు. జెండాగుడ్డ మటుమాయమైపోయింది. ఆశ్చర్యంగా ఉందే. ఎలా మాయమైంది? పిల్లలెవరైనా పట్టుకుపోయారా? నమ్మబుద్ధికాలేదు. ఇప్పుడెలా? తెల్లవారితే జెండా ఎగరెయ్యాలికదా! ఎక్కడ దొరుకుతుంది జెండా?

ఆలస్యంగా ఇంటికి బయలుదేరాడు గురుమూర్తి.

ఇంట్లో కాళ్ళు నిలవలేదు. ఊరంతా అటూ ఇటూ రెండుసార్లు తిరిగాడు. కనిపించిన పిల్లలందర్నీ "జెండా గుడ్డ ఎవరు పట్టుకుపోయార్రా" అని అడిగాడు. "మాకు తెలియదు" అన్నారందరూ.

తిమ్మప్పగారింటి ముందు ఆశగా ఒకటి రెండు సార్లు తిరిగాడు గురుమూర్తి. వీధి చివర కనిపించాడు రాజా. పుల్లకు కందెన అద్దుకుని, తెల్లటి చొక్కా, పంట్లాం తొడుక్కున్న ఓ అమాయకుణ్ణి ఏడిపిస్తున్నాడు.

"బాబూ, రాజా" అన్నాడు గురుమూర్తి సౌమ్యంగా.

ఏమిటన్నట్లు కన్నెగరేశాడు రాజా.

"స్కూల్లో జెండా గుడ్డ కనిపించడం లేదు. నువ్వుగానీ చూశావేమోననీ..."

"ఏం? చూస్తే తప్పా?"

"తప్పని ఎవరన్నారు? అది కనిపించకపోతేనూ..."

"ఓహో! అలాగా? నాకెందుకు సార్ అది?"

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరాడు గురుమూర్తి.

రేపు జెండా ఎగరెయ్యాలి. మరో జెండా సంపాదించడానికి వ్యవధి లేదిప్పుడు. కొత్తది కొనుక్కోవాలన్నా, కుట్టించుకోవాలన్నా టౌనుకు వెళ్ళాలి. ఇరవై కిలోమీటర్ల దూరం. పైగా పొద్దుపోయింది.

ఆ రాత్రి సుఖంగా నిద్రపోలేదు గురుమూర్తి.

నిజం చెప్పాలంటే, బడిలో జాతీయపర్వాలు నిర్వహించడానికి మునుపటి ఉత్సాహం ఇప్పుడు లేదు గురుమూర్తికి. కారణం- ఆశాభంగాలే. లాభాలను, ప్రయోజనాలను వైయక్తిక దృష్టితో కాక, సామాజిక దృష్టితో చూసే స్వభావం అతనిది. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచీ దేశం అభివృద్ధి చెందింది అనేక రంగాలలో. కానీ, మానవత్వం మాట ఏమిటీ? దానిది పురోగమనమా, తిరోగమనమా? దాన్నెందుకు మరచిపోతున్నాడు మనిషి? అవినీతి పెరిగింది, ఆదర్శం తరిగింది. అవకాశవాదం విస్తరించింది, క్రమశిక్షణ కృశించిపోయింది. స్వార్థం బలిసింది, కారుణ్యం కరిగిపోయింది. పరోపకార వ్రతం పాతాళానికి పడిపోయింది, బాధ్యతారాహిత్యం పీఠమెక్కింది. విలాస జీవితమే మనిషికి ఆశయమైపోయింది. నైతిక విలువలకు నీడలేకుండా పోయింది. జాతి బతుకుతున్నది కానీ, మనుగడకు లక్ష్యమంటూ లేకుండాపోయింది. ఎందరు మహాత్ములూ,



మహాకవులూ ఎన్ని సందేశాలిస్తేనేం? మనిషి చెవికెక్కుతాయా అవి? మనిషి మృగమైపోతున్నాడు. ఏ మృగం ముందుగా అందుకోగలిగితే దానికే విందు. ఏ మృగం ముందుగా పరుగెత్తగలిగితే దానిదే బతుకు. తన సుఖలాలసే తప్ప పదుగురి బాగు పట్టడం లేదు మనిషికి. స్వాతంత్ర్య దినోత్సవంనాడు చేస్తున్న బాసలన్నీ ఏమైపోతున్నాయి? అరవయ్యేళ్ళ దరిదాపులకు చేరుకుంటున్న గురుమూర్తి జీవితంలో చివరికి మిగిలింది నిస్పృహే!

అందుకే బడిలో వేడుకలు జరపాలన్న ఆసక్తి పెద్దగా లేదతనికి. అయితే, తాను ఈ నెల చివర్లోనే ఉద్యోగ విరమణ చేయబోతున్నాడు. ఈ ఒక్క పర్వదినంగూడా తన చేతులమీద సాఫీగా జరిగిపోతే అదొక తృప్తి. లేకుంటే మిగిలేది అసంతృప్తే. రిటైరై ఇంట్లో కూర్చుంటే జెండా ఎగరేసే అవకాశం ఆ వెనుక ఉండదుకదా తనకు. కనిపించకుండాపోయిన జెండా కోసం తనకు గాక ఇంకెవరికుంటుంది ఇంత ఆరాటం.

తెల్లవారితే జెండా ఎగురబోదన్న నిరుత్సాహంతోనే రాత్రి గడిచిపోయింది. తెల్లవారింది. గురుమూర్తి తొందరగా కాలకృత్యాలు ముగించి, స్నానం చేసి, ట్రాన్సిస్టర్ దగ్గిర పెట్టుకుని అరుగుమీద వాలు కుర్చీలో కూర్చున్నాడు.

అప్పుడొచ్చాడు చంటీ ఆయనింటికి. చంటీ అంటే ఎవరు? ఒకటో తరగతి చంటీ. తిమ్మప్పగారి ఉమ్మడి కుటుంబంలో నుంచి వచ్చి చదువుకుంటున్న చంటీ. 'క్రాపు చేయించాలి' అంటూ నిన్నటి సాయంకాలం రాజా బడికి వచ్చి వెంటతీసుకుపోయిన చంటీ.

వచ్చి మేష్టారి ముందు నుంచున్నాడు చంటీ.

"ఏమిట్రా" అన్నాడు గురుమూర్తి.

ఆ మాటకు జవాబుగా వాడు చొక్కా కింద దాచిపెట్టిన జెండా గుడ్డను తీసి ఆయనకిచ్చాడు.

సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాడు గురుమూర్తి.

"నువ్వా తీసుకుపోయావ్ దీన్ని!"

కాదన్నట్లు తలాడించాడు వాడు.

"మరైతే ఇంకెవరు?"

వాడి కళ్ళల్లో కాస్తంత భయం తొంగిచూసింది.

"రాజా తీసుకుపోయాడా?"

ఔనన్నట్లు తలూపాడు చంటీ.

"వాడికి తెలీకుండా తెచ్చావా దీన్ని?"

ఔనన్నట్లు మళ్ళీ తలూపాడు వాడు.

గురుమూర్తి కళ్ళలో ఆనందబాష్పాలు! ఆయన వాణ్ణి దగ్గరకు తీసుకుని నుదురు ముద్దెట్టుకున్నాడు.

చాలు. ఈ తృప్తి చాలు తనకు. నిరాశావాదం తగదు. జాతిని గౌరవించేవాళ్ళు, జాతీయ లక్ష్యాలను మన్నించేవాళ్ళు ఈ జాతి గడ్డపైన ఉన్నారు- రేపటి పౌరులు. నిన్న చూడకపోయినా, నేడు కానరాకున్నా, రేపు ఎప్పుడో ఒకనాడు మహాత్ముల కలలు ఫలించకపోవు. భారతావని భూతల స్వర్గంగా భాసిల్లకపోదు.

అనుకున్న ప్రకారం, అనుకున్న వేళకు బడిలో జెండా ఆనందంతో నర్తించసాగింది, పిల్లలు పాడుతున్న పాట విని పరవశించిపోతూ.

"అదిగో అదిగో మన జెండా
అందమైనది మన జెండా
ఆనందం తలకెత్తుకుని
ఆకాశానికి ఎగిరింది
మనమంతా కులాసాగా
ఉన్నామని తానంటోంది
అదిగో అదిగో మన జెండా
అదిగో అదిగో మన జెండా..." ■

చిత్రాలు: నర్సిం

